


## విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

● కలెక్టర్ కుమార్ దీపక్



కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మందమర్రిరూరల్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. తరగతిగదులు, పరిసరాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. చదువుతో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులు, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు పనులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, ప్రజలకు జవాబుదారిగా పనిచేయాలన్నారు. అనంతరం వెంకటాపూర్ గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. మొక్కలను సంరక్షణకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌కుమార్, ఆర్ఐ గణపతి, అధికారులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హాజీపూర్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపేట 33/11 సబ్ స్టేషన్ పరిధిలోని శనివారం గుడిపేట, ముల్కల్ల, చందనాపూర్, నంనూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని ఏఈ మహేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముత్యంపేటలో కబ్జా చేసిన గిరిజన భూముల్లో ఏర్పాటు చేసిన రైస్ మిల్లు



సర్వే జరుపుతున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

# గిరిజన భూములకు రక్షణ ఏదీ..?

## గుట్టుచప్పుడు కాకుండా కబ్జా..

- స్వాధీనం చేసుకోవడంలో అధికారుల అలసత్వం
- ఏడు నెలలు గడుస్తున్నా ముందుకు సాగని ప్రక్రియ
- ఐటీడీఏ పీవో ఆదేశాలూ బేఖాతర్
- అధికారుల వైఖరిపై కలెక్టర్‌కు గ్రామస్థుల ఫిర్యాదు

మంచిర్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం ముత్యంపేట గ్రామంలో కబ్జాకు గురైన గిరిజన (ఏజెన్సీ) భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడంలో రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారు. కబ్జాకు గురైన గిరిజన భూములను తక్షణమే కస్టడీలోకి తీసుకోవాలన్న ఉట్నూరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఖుష్బూ గుప్త ఆదేశాలను కూడా రెవెన్యూ అధికారులు ఖాతరు చేయడం లేదు. భూముల కబ్జా విషయం వెలుగులోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా రక్షణ చర్యలు చేపట్టడంలో సంబంధిత అధికారులు వెనుకడుగు వేస్తుండటంతో అనుమానాలు రేకెత్తు తున్నాయి. భూములను కబ్జా చేసిన వారికి రాజకీయ నాయకుల పరోక్ష మద్దతు ఉండబట్టే అధికారులు స్పం దించడం లేదనే ప్రచారం సాగుతోంది. దీంతో గిరిజన భూముల రక్షణ గాల్లో దీపం మాదిరిగా తయారైందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కబ్జాకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకొని, వాటికి రక్షణ కల్పిస్తారని ప్ర జలు ఎదురు చూస్తుండగా, అధికారుల నుంచి ఎలాం టి స్పందన లేకపోవడంతో గ్రామానికి చెందిన కొండ నరేష్ అనే యువకుడు ఈ నెల 16వ తేదీన కలెక్టర్ కుమార్ దీపక్‌కు ఫిర్యాదు చేశారు.

### అక్రమంగా రైస్ మిల్లు ఏర్పాటు...

ముత్యంపేట గ్రామంలోని గిరిజన భూములను కబ్జా చేసిన వ్యాపారి ఒకరు అందులో అక్రమంగా రైస్ మిల్లు కూడా ఏర్పాటు చేశాడు. గ్రామం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతంలో ఉంది. ఇక్కడ గిరిజన చట్టాలైన 1/70, పేసా చట్టాలు అమలులో ఉన్నాయి. అయినప్పటికీ గిరిజనేతరులైన ఇద్దరు బడా వ్యక్తులు గిరిజనుల భూములను కబ్జా చేశారు. సర్వే నెంబరు 17లో 34 గుంటలతో పాటు దాని సమీపంలోని సర్వే నెంబరు 18లో మరో ఆరు గుంటల భూమిని అక్రమంగా తమ ఆధీనంలో ఉంచుకున్నారు. పైగా ఎలాంటి అనుమతులు లేకుండా, కనీసం గ్రామ పంచాయతీ ట్రేడ్ లైసెన్స్ కూడా పొందకుండా మినీ రైస్‌మిల్లు ఏర్పాటు చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా అదే భూమిని ఉట్నూరులోని ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఇళ్లు లేని పలువురు గిరిజనులకు ఇంటి స్థలాల కోసం కేటాయిస్తూ గతంలో ఆదేశాలు జారీ చేశారు. పీవో ఆదేశాల మేరకు భూమిని ఇళ్లు లేని పేదలకు పంచాల్సి ఉండగా, స్థానిక రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవి అన్యాక్రాంతం అయ్యాయి. గిరిజన భూముల కబ్జా విషయం 'ఆంధ్రజ్యోతి' దృష్టికి రావడంతో 'ఏజెన్సీ భూమి కబ్జా' శీర్షికన నవంబరు 12న ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన ఐటీడీఏ పీవో మరునాడు దండేపల్లి తహసీల్దార్‌కు సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఇదే విషయమై గ్రామస్థుల నుంచి ఫిర్యాదు స్వీకరించిన కలెక్టర్ సైతం..

(తరువాయి 7లో)



కల్వర్టు వద్ద నిరసన దీక్షలో కూర్చున్న సీపీఎం నాయకులు

## ఒర్రెపై వంతెన నిర్మాణం చేపట్టండి

● సీపీఎం నాయకుల నిరసన దీక్ష

నస్పూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని సంఘ మల్లయ్య పల్లె సమీపంలోని ఒర్రెపై ఉన్న కల్వర్టు ఇటీవల వరదలకు కొట్టుకుపోవడంతో శాశ్వత బ్రిడ్జి నిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కల్వర్టు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఒక రోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో వెంటనే ఒర్రెపై బ్రిడ్జి నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి లేకపోవడం వలన చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందన్నారు. మార్గం సక్రమంగా లేకపోవడంతో సంఘ మల్లయ్య పల్లె, ప్రశాంత్ నగర్, సుభాష్ నగర్, ఆదర్శనగర్, లక్ష్మి నగర్, కృష్ణాకాలనీ, ఎస్ఆర్‌పీ-1,3, శ్రీరాంపూర్ బస్టాండ్ ఏరియాలకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నరన్నారు. నెల రోజుల కిందట కురిసిన వర్షాల వలన వరదకు ఒర్రె ఉధృతంగా ప్రవహించి కల్వర్టు కొట్టుకుపోయిందన్నారు. అధికారులకు తాము సమాచారం ఇచ్చి వినతి పత్రాలు అందించి విన్నవించామన్నారు. అయిప్పటికీ అధికార యంత్రాంగం స్పందించలేదన్నారు. దీంతో తాము నిరసన దీక్షను చేశామని, అయినా స్పందన రాకుండా పోరాటం ఉధృతం చేస్తామని సీపీఎం నాయకులు వెల్లడించారు. ఈ నిరసన దీక్షలో సీపీఎం జిల్లా కార్యదర్శి గోమాస ప్రకాష్, నస్పూర్ మండల కార్యదర్శి మిడివెల్లి రాజ్‌కుమార్, సీపీఎం, డీవైఎఫ్ఐ నాయకులు ప్రేమ్ కుమార్, అరిగెల మహేష్, షాబుద్దిన్, గంపల భూమయ్య, అనిత, శ్రీనివాస్, విజయ్ కుమార్, జ్యోతి, అంజి, రవి, శేఖర్ పాల్గొన్నారు.

## హాస్టల్ వర్కర్ల నిరసన



కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న హాస్టల్ వర్కర్లు

నస్పూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఆశ్రమ పాఠశాలల హాస్టల్స్‌లో పని చేస్తున్న వర్కర్స్ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం వర్కర్లు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. వర్కర్లు చేస్తున్న సమ్మె శుక్రవారంతో నాల్గొవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గిరిజన హాస్టల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బి. మధు మాట్లాడుతూ జీవో నంబరు 64ను ప్రభుత్వం తీసుకురావాలని చూస్తోందన్నారు. ఒకవేళ జీవో అమలు జరిగితే వర్కర్ల వేతనాలు సగం వరకు తగ్గుతాయన్నారు. పెరుగుతున్న ధరలను అనుగుణంగా జీతాలు పెంచాల్సి ఉండగా ప్రభుత్వం ఇలా చేయడం సరైంది కాదన్నారు. ఆర్థిక మంత్రి స్పందించి గిరిజన ఆశ్రమ పాఠశాలల వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ నాయకులు రంజిత్ కుమార్, మధునమ్మ, భీంరావు, లక్ష్మన్, చందు, మొండన్న, లక్ష్మి, భాగ్య, సూరి, నర్సయ్య పాల్గొన్నారు.

## మాతృ శక్తి ఆధ్వర్యంలో దుర్గాష్టమి వేడుకలు

నస్పూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం రిటైర్మెంట్ కాలనీలో శుక్రవారం విశ్వహిందూ పరిషత్ మాతృ శక్తి ఆధ్వర్యంలో శుక్రవారం దుర్గాష్టమి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పాశ్చాత్య పోకడలకు దూరంగా ఉంటూ స్వధర్మాన్ని ఆచరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వక్త సురేఖ, పరిషత్ ఉపాధ్యక్షురాలు గొట్టి పర్తి కనకతార, జిల్లా కార్యదర్శి వేముల రమేష్, జిల్లా సంఘటన కార్యదర్శి రాజ్ కుమార్, మాతృ శక్తి నగర సంయోజిత ముత్యం పద్మ, సహ సంయో జిత మాలతి, గంగాధర్, ఇరుకుల్ల రాజేష్, సందేష్ గుప్తా, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పింఛన్లు పెంచాలని వినతి

భీమారం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ, కల్లుగీత కార్మికులకు పింఛన్‌లు పెంచాలని కోరుతూ శుక్రవారం వీహెచ్‌పీఎస్ నాయకులు మండల తహసీల్దార్‌కు వినతఇ పత్రం అందించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వికలాంగులకు రూ. 6 వేలు, వృద్దులకు, వితంతవులు, తదితర పింఛన్ దారులకు రూ. 4 వేలు పింఛన్ ఇస్తానని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. వెంటనే పింఛన్‌లను పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లచ్చన్న, సతీష్, మొండి, నవీన్, రాజబాపు తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీ గిరిజనులకు అవగాహన లక్సెట్టిపేట సీఐ రమణామూర్తి

## చెట్లు నరికితే చర్యలు తప్పవు

జన్నారం, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): చెట్లను నరికిన, అడవిని ఆక్రమించిన చర్యలు తప్పవని లక్సెట్టిపేట సీఐ రమణామూర్తి అన్నారు. శుక్రవారం కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం అటవి డివిజన్‌లో గల పా లగోరి అటవి ప్రాంతంలో ఇటీవల ఆదివాసీ గిరిజనులు ఆక్రమించి గుడిసెలు వేసి చెట్లను నరికివేయడంతో అటవీశాఖ అధికా రులు, పోలీసుసిబ్బంది తనిఖీలు నిర్వహించారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు తప్పవని హెచ్చరించారు. దండేపల్లి, జన్నారం ఎస్ఐలు అమిత్‌షా, తహసీనోద్దీన్, ఇందన్‌పల్లిఎఫ్ఆర్‌వో శ్రీధరాచారి పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సరిపోల్చే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లోపాల్గొన్న కలెక్టర్, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 2002, 2025 ఓటరు జాబితా సరిపోల్చే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికలఅధికారి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాల మధ్య విశ్లేషణ, మ్యాచింగ్, బ్యాచింగ్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా పరిశీలనను వ్యవస్థీకృతంగా నిర్వహించేందుకు నాలుగు కేటగిరీలుగా విభజించి తదనుగుణంగా నిర్ధేశాలు ఇచ్చామన్నారు. నివేది కలను ఈనెల 24లోగా సమర్పించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వారీగా నివేదికలు రూపొందించాలన్నారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా సరి పోల్చే ప్రక్రియను ఎన్నికల విభాగం అధికారుల సమన్వయంతో వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ చంద్రకళ, తహసీల్దార్, అధికారులు పాల్గొన్నారు.

## మందమర్రికి అన్ని బస్సులు నడిపించండి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి ఆర్టీసీ బస్టాండ్‌కు అన్ని బస్సులు వచ్చేలా అదేవిధంగా హైదరాబాద్‌కు వెళ్లెందుకు మరో బస్సు వేయాలని కోరుతూ మందమర్రి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంచిర్యాల డిపో మనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రామస్వామి, సురేందర్ మాట్లాడుతూ మందమర్రి బస్టాండ్‌కు బస్సులు రాక వెలవెలబోతోందన్నారు. ఇక్కడి నుంచి మంచిర్యాలతో పాటు ఆసిఫాబాద్, కరీంనగర్, హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణ కేంద్రం నుంచి ప్రతిరోజు మంచిర్యాలకు ఉపాధికోసం వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హైదరాబాద్‌కు రెండు బస్సులు ఉండేవని ప్రస్తుతం ఒక్కటే బస్సు నడుస్తుందని దీంతో నానా యాతన పడుతున్నారని తెలిపారు. ఆర్టీసీకి మందమర్రి నుంచి భారీగానే ఆదాయం ఉంటుందని ఇప్పటికైన అన్ని బస్సులు నడుపడంతో కార్గొబస్సు ఏర్పాటు చేయాలన్నారు.

దీనిపై డిపోమేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఎండీ కౌసిక్, గణేష్, కిరణ్, సతీష్, సాయి, కిరణ్‌లు పాల్గొన్నారు.



మంచిర్యాల డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

## ఆదివాసీలకు పోడు భూముల హక్కు పత్రాలు అందించాలి

● మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేత



హైదరాబాద్‌లో మంత్రి సీతక్కకు వినతి పత్రాన్ని ఇస్తున్న దమ్మనపేట గిరిజనులు

దండేపల్లి సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దమ్మన్నపేట ఆదివాసి నాయ క పోడు గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు అందించి ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజనులు కోరారు. శుక్రవారం హైదరా బాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు రాష్ట్ర గిరిజన అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొట్నాక తిరుపతి, ఆదివాసి నాయకపోడ్ సంఘాల ఆధ్వర్యంలో దమ్మనపేట గిరిజనులు వినతిపత్రాన్ని అందజేశారు. జీసీసీ ఛైర్మన్ తిరుపతి మాట్లాడుతూ దమ్మనపేట చెందిన ఆదివాసి గిరిజనులు 80కుటుం బాలు తాళ్లపేట అటవీ రెంజ్ పరిధిలో లింగాపూర్ అటవీ బీట్‌లో పోడు వ్యవసాయం చేసుకుంటున్న దానిపై మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కాని ఇటీవల అటవీ శాఖ అధికారులు ఆదివాసి గిరిజనులపై తప్పుడు కేసులు బనాయిస్తూ వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మంత్రి సీతక్క దృష్టికి తీసుకవచ్చారు. 25ఏళ్ల నుంచి అ ప్రాంతంలో గిరిజనులు పోడు వ్యవసాయం చేసుకుంటున్నారని మంత్రికి వివరించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదివాసి గిరిజనులకు అటవీ భూమి హక్కు పత్రాలు ఇచ్చే విధంగా చూడాలని మంత్రి సీతక్కను గిరిజనులు కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసి గిరిజన సంఘాల నాయకులు, దమ్మనపేట పోడు వ్యవసాయ బాధితులు గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

## టీబీ నిర్మూలనే లక్ష్యంగా పని చేయాలి

లక్సెట్టిపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి ని ర్మూళనే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయని లక్సెట్టిపేట మండలం వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సతీష్ అన్నారు. శుక్రవారం మండలంలోని జెండవెంకటాపూర్ గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో బాగంగా ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఈశిబిరంలో సుమారు 120 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు అందులో సుమారు 40మందిని 102వాహనంలో ఎక్స్‌రేతో పాటు ఇతర పరీక్షల నిమిత్తం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. టీబీ రహిత దేశంగా మర్చడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది ముందుకు సాగుతున్నారని ప్రతీ గ్రామంలో వైద్య శిబిరాలను ఏర్పాటుచేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ సురేష్, పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ శోభ, ఎంఎల్ హెచ్‌పీ రజిత, హెల్త్‌అసిస్టెంట్ గఫూర్, ఐసీటీసీ కౌన్సిలర్ ఆంజనేయులు, ఏఎన్ఎంలు రజిత, రమ, అంగన్‌వాడీ కార్యకర్త తిరుమల, ఆశా కార్యకర్తలు విజయలక్ష్మి, పుష్పలత, సత్యవతి, గురులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జెండవెంకటాపూర్ వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది

## స్త్రీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు




గైనకాలజిస్టుకు మొక్కను అందిస్తున్న వైద్యులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్వస్థనారి శశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాత మంచిర్యాల లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్త్రీలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. స్త్రీల ప్రత్యేక వైద్య నిపుణురాలు డాక్టర్, గైనకాలజిస్టు కీర్తి శిబిరానికి హాజరు కాగా వైద్యులు ఆమెకు మొక్కను అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ కీర్తి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు 150 మంది స్త్రీలకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. క్యాన్సర్, మధుమేహం, బీపీ వంటివి పెరుగుతున్నందున జీవన శైలిలో మార్పులు చేసుకోవాలని, వ్యాయామం, యోగా చేయాలని స్త్రీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు శివ ప్రతాప్, స్నేహిత, వెంకటేశ్వర్లు, సీహెచ్‌వోలు నాందేవర్, శ్రీనివాస్ మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## పూల పండుగకు నజరానా

- ఎస్‌హెచ్‌జీ సభ్యులకు సీఎం రేవంత్‌రెడ్డి కానుక
- ఒక్కొక్కరికి రెండేసి చీరలు ..
- జిల్లాలో 1,76,500ల పంపిణీ

7

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

భీమారం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్తగూడెం నాయకపోడు కాలనీకి చెందిన ఈద లక్ష్మణ్ (31) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మణ్ కూలీ పనులు చేసేవాడు. లక్ష్మణ్ ఈ నెల 9న క్షణికావేశంతో పురుగుల మందు తాగగా కుటుంబీకులు గమనించి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో నాలుగు రోజులు వైద్యం పొంది ఇంటికి చేరుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున దగ్గు, దమ్ము, కడుపు ఉబ్బరం ఎక్కువ కావడంతో కుటుంబీకులు మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. లక్ష్మణ్‌కు భార్య రజిత, కుమార్తె అర్చన ఉన్నారు.

## నానో యూరియాపై రైతులకు అవగాహన

దహెగాం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం రైతులకు నానో యూరియా వినియోగం, లాభాలపై ఏవో రామకృష్ణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. నానో యూరియా పిచికారితో కాలుష్యాన్ని అరికట్టవచ్చని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఈవోలు ఆనంద్‌రావు, వంశీ పాల్గొన్నారు.

# లాభాల వాటా ప్రకటన ఎప్పుడు?



● కార్మికుల ఎదురుచూపులు ● ఆరు నెలలుగా తేల్చని యాజమాన్యం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు లాభాల వాటా కోసం వేచి చూస్తున్నారు. ఏటా మాదిరిగానే 2024-25 ఆర్థిక సంవత్సరం సైతం సింగరేణి సంస్థ నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకున్నది. కానీ ఆర్జించిన ఆదాయం, కార్మికులకు చెల్లించాల్సిన వాటా గురించి మాత్రం యాజమాన్యం నుంచి ప్రకటన రావడం లేదు. ఫలితంగా చెల్లింపు తరువాత కనీసం లాభాల వాటా ప్రకటన ఎప్పుడా అని కార్మికులు ఎదురుచూస్తున్నారు.

### 1998 నుంచి కార్మికులకు వాటా

సింగరేణి సంస్థకు వచ్చిన లాభాల నుంచి కార్మికులకు వాటా చెల్లించడం 1998లో ప్రారంభమైంది. మొదట్లో 10 శాతం వాటా ఇచ్చారు. ప్రతి ఏడాది అది పెరుగుతూ వస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి 70.02 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించగా, 2 వేల 412 కోట్ల రూపాయలు ఆర్జించింది. ఇందులో నుంచి 33 శాతం లాభాల వాటాగా అంటే 796 కోట్ల రూపాయలను కార్మికులకు వాటాగా చెల్లించారు. గతంలో ఆర్థిక సంవత్సరం ముగిసిన వెంటనే వాటా గురించి ప్రకటన చేస్తుండేవారు. కానీ కొన్నేళ్లుగా లాభాల వాటా ప్రకటనతో పాటు చెల్లింపు కూడా ఆలస్యమవుతోంది. మార్చిలో లెక్కలు ముగుస్తాయి. యాజమాన్యం మాత్రం దసరాకు వాటా చెల్లింపు చేస్తోంది.

### ఈసారీ అదే తీరు

ముగిసిన ఆర్థిక సంవత్సరం కంపెనీ 69.01 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించగా, ఆదాయం గురించి ప్రకటన వెలువడలేదు. కార్మికులకు చెల్లించే వాటాను కూడా తేల్చలేదు. గతంలో యాజమాన్యం నుంచి వెంటనే ప్రకటన వెలువడే సంప్రదాయం ఉండగా, గత 11 సంవత్సరాలుగా రాజకీయ కారణాలతో రాష్ట్ర ప్రభుత్వమే ప్రకటిస్తోంది. దీంతో వాటా ప్రకటన, చెల్లింపులో ఆలస్యం జరుగుతోంది.

### యూనియన్ల నుంచి డిమాండ్..

గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో పాటు అన్ని కార్మిక సంఘాలు లాభాల వాటాపై ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. కొన్ని యూనియన్లు 30 శాతం, 35 శాతం అడుగుతుండగా, మరికొన్ని 40 శాతం, 50 శాతం ఇవ్వాలని కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రకటన వెలువడితే చాలు అన్న పరిస్థితి నెలకొంది. అయితే లాభాల వాటా గురించి ఇటీవల సింగరేణి బోర్డు డైరెక్టర్ల సమావేశమైనట్లు తెలిసింది. త్వరలో ప్రకటన వెలువడే అవకాశం ఉంది. గత ఆర్థిక సంవత్సరం మాదిరిగానే కాకుండా ఈసారి మెరుగైన లాభాల వాటా ప్రకటించాలని కార్మికులు కోరుతున్నారు.

**గతంలో చెల్లించిన వాటా**

| ఆర్థిక సంవత్సరం | ఉత్పత్తి (మి.టన్నుల్లో) | వచ్చిన లాభం (కోట్లలో) | చెల్లించిన శాతం | ఇచ్చిన వాటా (కోట్లలో) |
|---|---|---|---|---|
| 2010-11 | 51.33 | 351.37 | 16 | 56.21 |
| 2011-12 | 52.21 | 358.27 | 17 | 60.90 |
| 2012-13 | 53.19 | 401.00 | 18 | 72.18 |
| 2013-14 | 50.40 | 418.74 | 20 | 83.74 |
| 2014-15 | 52.54 | 490.44 | 21 | 102.99 |
| 2015-16 | 60.38 | 1066.13 | 23 | 245.20 |
| 2016-17 | 61.34 | 395.38 | 25 | 98.00 |
| 2017-18 | 62.01 | 1212.75 | 27 | 327.44 |
| 2018-19 | 64.50 | 1766.00 | 28 | 494.00 |
| 2019-20 | 64.02 | 993.86 | 28 | 278.28 |
| 2020-21 | 50.58 | 272.64 | 29 | 79.06 |
| 2021-22 | 65.00 | 1227.00 | 30 | 368.00 |
| 2022-23 | 67.14 | 2222.46 | 32 | 711.18 |
| 2023-24 | 70.02 | 2412.00 | 33 | 796.00 |
| 2024-25 | 69.01 | --- | -- | --- |

## సింగరేణి కార్మికుడి ఆత్మహత్య

నస్పూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణం శ్రీరాంనగర్ కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు సీర్ల శ్రీనివాస్ (38) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఉపేందర్ రావు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... న్యూ నాగార్జున కాలనీలో నివాసం ఉంటూ ఆర్కే-7 గనిలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ఉదయం మిడిల్ షిఫ్టుకు వెళ్లి తిరిగి శ్రీరాంనగర్ కాలనీలోని స్వంత ఇంటికి వెళ్లాడు. కొద్ది సేపటికి తండ్రి నర్సయ్య ఇంటికి వచ్చి చూసే సరికి శ్రీనివాస్ కాలిన గాయాలతో పడి ఉన్నాడని, ఆయన పక్కనే యాసిడ్ బాటిల్ ఉన్నదని ఎస్సై తెలిపారు. వెంటనే చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్యూటీ డాక్టర్ పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారని తెలిపారు. సంఘటన స్థలాన్ని మంచిర్యాల సీఐ అశోక్, ఎస్సై ఉపేందర్ రావు పరిశీలించారు. శ్రీనివాస్ మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సంధ్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ రావు తెలిపారు.

## ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడి మృతి

రెబ్బెన, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం నంబాలలో ట్రాక్టర్‌పై నుంచి పడి ఓ యువకుడి మృతి చెందినట్టు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నంబాలకు చెందిన నాందేవ్(35) శుక్రవారం ట్రాక్టర్ కడగడానికి సమీపంలోని చెరువుకు వెళ్లాడు. అనంతరం ఇంటికి వస్తున్న క్రమంలో ట్రాక్టర్‌పై నుంచి పడి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నేరాల నియంత్రణే ధ్యేయం



మాట్లాడుతున్న సీఐ సంజయ్

రెబ్బెన, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ కోసం కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు రెబ్బెన సీఐ సంజయ్ అన్నారు. మండలంలోని సింగిల్‌గూడలో శుక్రవారం కమ్యూనిటి కాంటాక్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చిన కూడా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గంజాయి, గుడంబా, రేషన్ సరఫరా వంటి దందాలపై కూడా సమాచారం పోలీసులకు ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. నేరాలను అదుపులోకి తెచ్చేందుకు ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు వెంకటకృష్ణ, వెంకటేష్, 20 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలు, 2 లీటర్ల గుడంబాను స్వాధీనం చేసుకున్నారు.

## నాణ్యమైన విత్తనంతో దిగుబడి




మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నాగరాజు

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనంతో దిగుబడి వస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లికి చెందిన శాస్త్రవేత్త నాగరాజు అన్నారు. కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి గ్రామంలోని కుర్సింగు తిరుపతికి చెందిన కంది క్షేత్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త నాగరాజు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాన్ని రైతులు సాగు చేసి తదుపరి పంట ద్వారా ఉత్పత్తియైన విధానాన్ని తోటి రైతులకు తక్కువ ధరకే అందజేయాలన్నారు. ఎంపిక చేయబడిన రైతులకు విత్తనోత్పత్తిపై ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రామ్మకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి సృజన పాల్గొన్నారు.

## సీఎండీ బలరాంనాయక్‌కు అత్యుత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న సీఎండీ బలరాంనాయక్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణిని అభివృద్ధి పథంలో నడుపుతూ సంస్థకు భవిష్యత్ పునాదులు వేసిన సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌కు మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. దక్షిణ భారత దేశంలో అత్యుత్తమ సంస్థ నాయకుల క్యాటగిరిలో సీఎండీని గుర్తిస్తూ ఏసియా ఆఫ్ పసిక్ హెచ్‌ఆర్ఎం కాంగ్రెస్ వారు ఈ అవార్డు అందజేశారు. గురువారం రాత్రి బెంగుళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో బలరాం అవార్డు అందుకున్నారు. అతిథులుగా ఈస్టర్న్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఇంటిగ్రేటెడ్ లర్నింగ్ ఇన్ మేనేజ్‌మెంట్ (కోల్‌కతా) చైర్మన్, డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్‌బీ బెనర్జి, అడ్వంటేజ్ గ్రూప్ వ్యవస్థాపకురాలు స్మిత్ భట్ దియోర పాల్గొన్నారు. అంతర్రాష్ట్ర మైనింగ్‌తో ఒడిశా నైని బ్లాక్‌ను ప్రారం భించడం, కర్ణాటకలో బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్ పొందడం, రాజస్థాన్ సోలార్, థర్మల్ ప్లాంట్ల ఒప్పందం చేయడంతో బలరాం కీలకపాత్ర పోషించారు.

## స్టాండర్డైజేషన్ కమిటీలో ఐఎన్‌టీయూసీకి చోటు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోల్ ఇండియా జేబీసీసీఐ-11 స్టాండర్డైజేషన్ కమిటీలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కు స్థానం కల్పిస్తూ కలకత్తా హైకోర్టు ఇటీవల తీర్పు వెలువరించింది. ఈ తీర్పుతో ఈ నెల 22వ తేదీన జరగనున్న ఆరో జేబీసీసీఐ-11 స్టాండర్డైజేషన్ కమిటీ సమావేశంలో ఐఎన్‌టీయూసీ పాల్గొననుంది. ఆల్టర్‌నేట్ సభ్యుడిగా ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్‌ను ప్రతిపాదిస్తూ ఫెడరేషన్ తీర్మానించింది. దీంతో జనక్ ప్రసాద్‌కు కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు, కేంద్ర నాయకులు సీహెచ్. భీంరావు, గరిగ స్వామి, తిరుపతి రాజు, పేరం రమేష్, ఏనుగు రవీందర్ రెడ్డి, జీవన్ జోయల్, చాట్ల అశోక్ లేగల శ్రీనివాస్, ఐరెడ్డి తిరుపతిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

# పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ పూర్తి




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేశామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. హైదరాబాద్ నుంచి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్‌లు, ఎన్నికల అధికారులతో శుక్రవారం రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ 2002, 2025 ఓటరు జాబితాలను పరిపోల్చే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలు, శాసన సభ నియోజకవర్గాల వారీగా మ్యాపింగ్ చేపట్టాలని, 2002, 2025 ఓటరు జాబితా సరిపోల్చేందుకు ఏబీసీడీ విభాగాలుగా విభజించాలని తెలిపారు. అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు ఈ నెల 23 తేదీ లోగా ప్రక్రియ పూర్తి చేసి, ఈ నెల 24న తేదీన రాష్ట్ర ఎన్నికల అధికారికి నిర్ణీత నమూనాలో నివేదిక సమర్పించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిలాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేశామని అన్నారు. 2002, 2025 ఓటరు జాబితాలను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నాలుగు కేటగిరీలుగా విభజించాచమని అన్నారు. విరాలను నిర్ణీత ప్రోఫార్మాలో ఈ నెల 24వ తేదీన సమర్పిం చేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నా రు. బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు ఖాళీలను భర్తీ చేసి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకంటామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీడీ రమాదేవి

కెరమెరి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పీఎం జుగా పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవలని ఐటీడీఏ డీడీ రమాదేవి అన్నారు. శుక్రవారం ఆమె సాకడ గ్రామస్థులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరంగా గ్రామంలో పీఎం జుగా పథకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ అధికారులు ఆయా గ్రామాల్లో నెలకొన్న మౌలిక వసతులను గుర్తించి గ్రామ సభలకు వచ్చే అధికారులకు తెలపాలని సూచించారు. ఆయా గ్రామాల్లో సమస్యలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అంజద్‌పాషా, ఎంఈవో ప్రకాష్, ఎస్ఈఆర్‌పీ శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి భవన్‌ను ముట్టడించిన టీబీజీకేఎస్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీబీజీకేఎస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌ను ముట్టడించారు. అనంతరం యూనియన్ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను యాజమాన్యం ప్రకటించకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. లాభాల నుంచి కార్మికులకు 35 శాతం చెల్లించాలని, మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జీఎం(సీడీఎన్) శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్, సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్ రెడ్డి, ఏరియా మాజీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# లాభాల వాటా ప్రకటించకపోతే సమ్మె



జీఎం కార్యాలయం ఎదుట దర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం లాభాల వాటా ప్రకటించకపోతే సమ్మె చేపడతామని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. సింగరేణిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లాభాలవాటా ప్రకటించాలని ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దర్నా నిర్వహించారు. అంతకుముందు జాతీయ రహదారి నుంచి జీఎం కార్యాలయం వరకు ప్రభుత్వం యాజమాన్యంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాథుని సుదర్శన్, బెల్లంపల్లి కార్యదర్శి దాగాం మల్లేశ్ మాట్లాడారు. సింగరేణిలో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు కావస్తున్న లాభాల వాటా ఇంత వరకు ప్రకటించకపోవడం దారుమన్నారు. గతంలో లాభాలా వాటా చెల్లింపులు జరిగేవని చెప్పారు. దేశ ప్రగతిలో మూలస్తంభాలుగా ఉంటున్న సింగరేణీ యుల పట్ల యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న డిమాండ్ల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైన లాభాలావాటా ప్రకటించి చెల్లించాలని కోరారు. రెండు రోజుల్లో ఈ ప్రకటన రాకపోతే లాభాల వాటా చెల్లింపు కోసం సమ్మె తప్పదని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాగాం మల్లేశ్, ఇప్పకాయల లింగయ్య, అస్గర్ అలీ, కంది శ్రీనివాస్, ఎం. వెంకటేశ్వర్లు,అన్ని గనుల ఫిట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

**రెబ్బెన, (ఆంధ్రజ్యోతి):** కార్మికులకు యాజమాన్యం 35 శాతం లాభాల వాటా చెల్లించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి డిమాండ్ చేశారు. సింగరేణిలో కార్మికుల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం బెల్లంపల్లి జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాభాల వాటా 35 శాతం ౧ కార్మికులకు త్వరగా చెల్లించాలన్నారు. వీటితో పాటు స్ట్రక్చర్ కమిటీ సమావేశం నిర్వహించి సొంతింటి పథకం, అలవెన్స్‌పై ఐటీ కంపెని చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జగ్గయ్య, రాజేష్, కిరణ్ బాబు, మీస చంద్రశేఖర్, సముద్రాల ఆనంద్, మారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సింగరేణి సమాచారం

## బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో ఈ 23న నిర్వహించే బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని హెచ్ఎంఎస్ రాష్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఈ ఉత్సవాలకు యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హాజరవుతారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా బతుకమ్మ పండుగకు ప్రాధాన్యత తీసుకువచ్చింది కవిత మాత్రమేనన్నారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిగా, బీఆర్ఎస్ నాయకురాలిగా, ఎమ్మెల్సీగా తన పదవులకు ఆమె రాజీనామా చేశారన్నారు. హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలిగా ఎన్నికైన తరువాత మొదటిసారిగా శ్రీరాంపూర్‌కు వస్తున్నట్లు చెప్పారు. బతుకమ్మ ఉత్సవాల అనంతరం వారిని ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. సింగరేణి యాజమాన్యం, ఏఐటీయూసీ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. సీఐటీయూ క్వార్టర్ కావాలా, ఇల్లు కావాలా అని ఓటింగ్ నిర్వహించడం తప్పుడు ప్రక్రియ అని ఆరోపించారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, ఏరియా కార్యదర్శి అశోక్ కుమార్, నాయకులు దుర్గం లక్ష్మణ్, గోళ్ల సత్యనారాయణ, తుల అనిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఎస్‌సీసీడబ్ల్యూయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి. బ్రహ్మానందం అన్నారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంల శుక్రవారం ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సెక్యూరిటీ విధులు నిర్వర్తిస్తున్న ప్రైవేటు గార్డులకు వసతులు కల్పించాలన్నారు. జీవీఆర్ క్యాంప్, సీఎస్‌పీ, స్టోర్స్, సీడీవై, స్ర్కాప్ యార్డు, ఎస్ఆర్‌పీ 3ఏ పోస్టుల వద్ద నీడ లేకపోవడంతో వర్షం వస్తే డ్యూటీ చేసే పరిస్థితి లేదన్నారు. చుట్టూ నీటి ప్రవాహం ఉంటుందని, కొన్ని ప్రాంతాల్లో పై కప్పులు లేకుండా ఇబ్బందికరంగా ఉందన్నారు. దొంగల బెడద ఎక్కువగా ఉన్నందున ప్రతి పోస్టు వద్ద ఇద్దరు గార్డులను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు శంకరి, సత్యం, కొదురుపాక సదానందం, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి భవిష్యత్తుపై కార్యాచరణ చేపట్టాలి



కోదండరాంతో మాట్లాడుతున్న నాయకులు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి భవిష్యత్తుపై యాజమాన్యం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోదండరాం అన్నారు. తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని తెలంగాణ జన సమితి కార్యాలయంలో ఆయనను కలిసి సింగరేణికి చెందిన పలు సమస్యలు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో నూతన గనులు రావడం లేదన్నారు. ఓసీపీని ఏర్పాటు చేయవద్దని కోరారు. సంస్థకు అనుబంధంగా పరిశ్రమలు స్థాపిస్తే యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. లాభాలను వెంటనే ప్రకటించాలన్నారు. కార్మికులకు 40 శాతం వాటా పంపిణీ చేయాలని, సొంతింటి పథకం అమలు చేయాలని, మారుపేర్ల సమస్య పరిష్కరిం చాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కోర్టు ఆదేశాల ప్రకారం వేతనాలు చెల్లించాలని, పండుగలో పు బోనస్‌లు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్య క్షుడు కామెర గట్టయ్య, ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, వర్కింగ్ ప్రెసి డెంట్ నీరటి రాజన్న, రాష్ట్ర కార్యదర్శి సమ్ము రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు చెల్లించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వడం లేదని వెంటనే చెల్లించాలని శ్రీరాంపూర్ ఓసీపీ ఓబీ కాంట్రాక్ట్ కార్మికులు పేర్కొన్నారు. శుక్రవారం కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ, గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అందరు కార్మికులు వేతనాలు పొంది పండుగ సంతోషంలో ఉండగా, తాము మాత్రం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికైనా సింగరేణి ఉన్నతాధికారులు స్పందించి తమ వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కోటపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సేవా పక్షంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్టాండ్ ప్రాంత పరిసరాలను నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సేవా పక్షం జిల్లా కన్వీనర్ పట్టి వెంకటకృష్ణ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, నాయకులు వెంకటేష్, రాజేష్, నాగేశ్వర్‌రావు, పున్నం చంద్, రామయ్య, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

## రావణ దహనాన్ని అడ్డుకుంటాం



మాట్లాడుతున్న దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు

బెల్లంపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దసరా పండుగ రోజు తిలక్ స్టేడియంలో నిర్వహించే రావణాసుర వధను అడ్డుకుంటామని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో వారు మాట్లాడుతూ రావణాసురుడి విగ్రహం దహనం చేయడం వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల అధ్యక్షులు కుంబాల రాజేశ్, నాయకులు రాజనర్సు, గొమాస రాజం, రత్నం ఐలయ్య, గోపాల్, రాజలింగు, శేఖర్ పాల్గొన్నారు.

## మురిమడుగు గ్రామంలో వైద్య శిబిరం

జన్నారం, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురిమడుగు గ్రామంలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానికులకు మహిళలకు పురుషులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత, బీపీ, షుగర్ క్యాన్సర్ వంటి వ్యాధులపై వైద్యాధికారిణి ఉమాశ్రీ, లక్ష్మీ అవగాహన కల్పించారు. సిబ్బంది, గంగాదేవి, పోచయ్య, సులోచన, పాల్గొన్నారు.

# పూల పండుగకు నజరానా



జైపూర్‌లోని ఎంఎస్ గోదాంలో బతుకమ్మ చీరలను పరిశీలిస్తున్న సెర్ప్ అధికారులు

**ఎస్‌హెచ్‌జీ సభ్యులకు సీఎం రేవంతన్న కానుక**

**ఒక్కొక్కరికి రెండేసి చీరలు ..**

**జిల్లాలో 1,76,500ల పంపిణీ**

నెన్నెల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పూల పండగ బతుకమ్మను సంబరంగా జరుపుకోవాలని ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీ మహిళలకు నజరానాగా చీరలు పంపిణీ చేయనుంది. సీఎం రేవంతన్న కానుక పేరిట ఒక్కో సభ్యురాలికి రెండేసి చీరలు అందివ్వనున్నారు. ఈ నెల 21 నుంచి బతుకమ్మ సంబరాలు ప్రారంభం కానుండగా అదే రోజు నుంచి పంపిణీ ప్రారంభించే లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కులమతాలకు అతీతంగా అర్హులైన వారందరికి నాణ్యమైన చీరలు అందజేయనున్నారు. బతుకమ్మ పండుగకు జిల్లాల్లోని మొత్తం 1,76,500ల చీరలు పంపిణీ చేయనున్నారు.

**పొదుపు సంఘాల సభ్యులకే..**

గతంలో పంపిణీ చేసిన బతుకమ్మ చీరల పట్ల మహిళలు అసంతృప్తిగా ఉన్నారు. పండుగలకు ధరించే స్థాయిలో నాణ్యతా ప్రమాణాలు చీరల్లో లేవనే ఆరోపణలు వచ్చాయి. అలాంటి అపవాదు రాకుండా ప్రస్తుతం ఇచ్చే చీరలు మంచి రంగుల్లో నాణ్యమైనవి అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అధికారులు అంటున్నారు. మార్కెట్‌లో రూ. 800ల నుంచి వెయ్యి రూపాయల ధర పలుకుతుందని పేర్కొన్నారు. అప్పట్లో రేషన్‌కార్డు కలిగి ఉన్న వారిలో 18 ఏళ్ల పైబడిన వారికి చీరెలు ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం స్వయం సహాయక సంఘాల సభ్యులకు మాత్రమే ఇవ్వనున్నారు. పండుగ ముందు ఒక చీర ఆ తర్వాత మరోటి అందజేస్తారు.

**గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో**

గతంలో రేషన్ డీలర్ల ద్వారా చీరలు అందించగా ఇప్పుడు గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చీరల పంపిణీ చేస్తారు. స్వయం సహాయక సంఘాలు, సభ్యు లు, వారి వయసు, తదితర వివరాలను ప్రభుత్వానికి ఈ పాటికే పంపించారు. అర్బన్ ఏరియాల్లో మెప్మా, రూరల్ ప్రాంతాల్లో సెర్ప్ ద్వారా పంపిణీ ఉంటుంది. జిల్లాల్లోని 16 రూరల్ మండలాల్లో 1,19,518 చీరలు, అర్బన్ ఏరియాల్లో 56,982 చీరలు, మొత్తంగా 1,76,500 చీరలను కానుక రూపంలో ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వయసు పైబడి వారికి 9 మీటర్ల పెద్ద చీరలు, మిగతా వారికి ఆరున్నర మీటర్ల చీరలు అందిస్తారు.

**బతుకమ్మ చీరెల పంపిణీకి ఏర్పాట్లు**

**కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి**



బతుకమ్మ పండుగకు స్వయం సహాయక సంఘాల సభ్యులకు రెండేసీ చీరెలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పొదుపు మహిళలకు చీరలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. 1,76,500ల మందిని అర్హులుగా గుర్తించాం. చీరలస్టాక్ శుక్రవారమే జిల్లాకు చేరుకుంది. జైపూర్‌లోని మండల సమాఖ్య గోదాంలో వాటిని నిలువ చేశాం. అక్కడి నుంచి మండలాల స్టాక్ పాయింట్లకు తరలిస్తాం. గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు, సీఏలు మహిళలకు చీరలను అందజేస్తారు.

## పరిసరాల శుభ్రతపై అవగాహన పెంచుకోవాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని హోం సైన్స్ ఫుడ్ అండ్ న్యూట్రీషన్ సైంటిస్టు డాక్టర్. ప్రియా సుగంధీ అన్నారు. శుక్రవారం స్వచ్చత సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బాలుర గురుకుల సీవోఈ పాఠశాల, కళాశాలలో స్వచ్చతపై విద్యార్థులకు పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. అనంతరం సమతుల్య ఆహారంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌సాగర్, సూపిరింటెండెంట్ రాజశేఖర్, పీఎంసీ ఇన్‌చార్జి కమలాకర్, మల్లీఖార్జున్, శివతేజ, స్రవంతి, ప్రవీణ్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు షీల్డ్‌లు అందిస్తున్న ప్రిన్సిపల్,పీఈటీ

కోటపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన శ్రీవైష్ణవి, రష్మితలు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. ఈ నెల 18న ఆసిఫాబాద్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్ 19 విభాగంలో నిర్వహించిన వాలీబాల్ జట్టు సెలక్షన్‌లో ఇరువురు విద్యార్థినులు ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. అలాగే శ్రీవైష్ణవి ఉమ్మడి జిల్లా జట్టుకు కెప్టెన్‌గాను ఎంపికైందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను శుక్రవారం ప్రిన్సిపల్ రాజశేఖర్, పీఈటీ రాజయ్యలు అభినందించి షీల్డ్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గిరిజన భూములకు రక్షణ ఏదీ...?

(5వ పేజీ తరువాయి)

అక్రమంగా రైస్ మిల్లు ఏర్పాటు చేసిన స్థలంపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని నవంబరు 26వ తేదీన అదనపు కలెక్టర్ ద్వారా తహసీల్దార్‌ను ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ ఇచ్చిన గడువు ముగియడం, రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టకపోవడంతో గిరిజనులు డిసెంబరు 11న ఉట్నూరు ఐటీడీఏ పీవోను కలిసి ఏజెన్సీ భూమిని కాపాడాలని ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన పీవో భూములను స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్‌కు లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేశారు.

**సర్వే జరిపిన యంత్రాంగం....**

ఓ వైపు కలెక్టర్, మరోవైపు ఐటీడీఏ పీవో ఆదేశాలు ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో మండల రెవెన్యూ యంత్రాంగంలో కదలిక వచ్చింది. జనవరి 2న మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భూమన్న, సర్వేయర్ వినోద్, సదరు భూముల్లో సర్వే జరిపారు. విచారణలో సర్వే నెంబరు 17 లో మొత్తం 1.12 ఎకరాల ఏజెన్సీ భూములు కబ్జాకు గురైనట్లు అధికారులు నిర్ధారించారు. అందులో గతంలో గిరిజనులకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన 34 గుంటల భూమి కూడా ఉన్నట్లు తేల్చి, బౌండరీలు ఏర్పాటు చేశారు. కబ్జాకు గురైన 34 గుంటల్లో 10 గుంటలతో పాటు దాని పక్కనే ఉన్న సర్వే నెంబరు 18లోనూ మరో 6 గుంటలు అక్రమంగా చేజిక్కించుకున్న వ్యాపారి ఆ మొత్తం స్థలంలో రైస్ మిల్లును నిర్మించాడు. భూముల సర్వే పూర్తికావడంతో సంబంధిత నివేదికను తహసీల్దార్ ఐటీడీఏ పీవోకు అందజేశారు. దీంతో స్పందించిన ఐటీడీఏ పీవో కబ్జాకు గురైన ఏజెన్సీ భూమిని ప్రభుత్వ కస్టడికి తీసుకో వాలంటూ ఫిబ్రవరి 6న తహసీల్దార్‌కు లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. భూమిని స్వాధీనం చేసుకొనే క్రమంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

**ముందుకు సాగని ప్రక్రియ..**

స్థలాన్ని కస్టడీకి తీసుకోవాలన్న ఐటీడీఏ పీవో ఆదేశాలను అధికారులు బుట్టదాఖలు చేశారు. ఏడు నెలలు గడుస్తున్నా భూములను స్వాధీనం చేసుకోవడంలో అడుగులు ముందుకు పడలేదు. దీంతో అధికారుల వైఖరిపట్ల విసుగు చెందిన గ్రామస్థులు నాలుగు రోజుల క్రితం తిరిగి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటారా...? అని గ్రామస్థులు ఎదురు చూస్తున్నారు.

## ఎన్నికలపై అవగాహన ఉండాలి



మాక్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర స్వామి

కాసిపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో స్కూల్ క్యాబినెట్ ఎన్నికలను శుక్రవారం నిర్వహించారు. ఎంఈవో వెంకటేశ్వర స్వామి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఓటు హక్కు, ఎన్నికల ప్రాధాన్యం, రాజ్యాంగం పనిచేసే విధానాలపై అవగాహన కల్పించేందుకు ఈ ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌లను బ్యాలెట్ విధానం ద్వారా ఎంపిక చేశారు. హెడ్‌బాయ్‌గా కార్తీక్, హెడ్ గర్ల్‌గా చంద్రహాస్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అబ్దుల్ కలీల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గుడుంబా స్థావరాలపై విస్తృతంగా దాడులు

**ఎక్సయిజ్ సీఐ ఇంద్ర ప్రసాద్**

బెల్లంపల్లి, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఎక్సయిజ్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ ప్రొహిబీషన్ అండ్ ఎక్సయిజ్ ఆదిలాబాద్, జిల్లా ప్రొహిబీషన్ ఎక్సయిజ్ అధికారి ఆదేశాల మేరకు గుడుంబా స్థావరాలపై విస్తృతంగా దాడులు చేపడుతున్నామని ఎక్సయిజ్ సీఐ ఇంద్ర ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దసరా పండుగ నేపథ్యంలో బెల్లంపల్లి ఎక్సయిజ్ పరిధిలో గుడుంబా స్థావరాలపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా మందమర్రి మండలం, పులిమడుగు, కాసిపేట మండలంలోని ధర్మరావుపేట, మామిడిగూడ గ్రామాల్లో నాటు స్థావరాలపై ఎక్సయిజ్ సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. ఈదాడుల్లో పులిమడుగు గ్రామానికి చెందిన బానోత్ అంబ్రియ, భుక్య దేవిలపై, అదే విధంగా ధర్మరావుపేట గ్రామానికి బానోత్ లక్ష్మీ, బానోత్, రాజులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 15లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామని, 200 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేశా మన్నారు. ఈ దాడుల్లో మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య, ఎస్‌ఐలు శారద, వెంకటేశ్ సిబ్బంది అశోక్, దినేష్, గణేష్, శిరీసా, సాగర్, రమేశ్, ప్రశాంత్, కవిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సయిజ్ సీఐ ఇంద్ర ప్రసాద్

**గుడుంబా స్థావరాలపై దాడులు**

కాసిపేట : మండలంలోని మామిడిగూడెం, ధర్మారావుపేట తండా గ్రామాల్లో శుక్రవారం ఉదయం బెల్లంపల్లి ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్‌సిబ్బంది దాడులు చేశారు. ఈ దాడుల్లో ధర్మారావుపేట తండాలో బానోత్ లక్ష్మీ, బానోత్ రాజుల వద్దనుంచి బెల్లం పానకం, నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ తెలిపారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించిన కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య, ఎస్‌ఐలు శారద, వెంకటేష్, అశోక్, దినేష్, గణేష్, శిరీష, సాగర్, రమేష్, ప్రశాంత్, కవిత పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

తాండూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని అచ్చలాపూర్ జడ్పీ హెచ్ఎస్ పాఠశాల పదవ తరగతి విద్యార్థి రాజ్‌కుమార్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ సాంబమూర్తి శుక్రవారం తెలిపారు. ఇటీవల నస్పూర్‌లో సాధన స్పోర్ట్స్ అకాడమీ నిర్వహించిన 35వ సబ్‌జూనియర్ కబడ్డీ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. రాజ్‌కుమార్‌ను ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్, హరి ప్రసాద్, భాస్కర్, రవి, అంజిరెడ్డి, శ్రీనివాస్, సురేందర్, ఏపీసీ చైర్మన్ చిలకమ్మలు అభినందించారు.

## అంబులెన్స్ తనిఖీ

జన్నారం, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ ఆకస్మికంగా శుక్రవారం ప్రోగ్రాం మేనేజర్ కిషోర్, స్వామాట్, సంపత్‌లు తనిఖీ చేశారు. పరికరాల పనితీరు, రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని అభినందించారు. ఈఎంటీ జాడి రమేశ్, కిషన్, మునీందర్, పైలెట్లు గంగాధర్, రఫీక్, మహేందర్ పాల్గొన్నారు.

## టీఎల్ఎం మేళా విజయవంతం

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి టీఎల్ఎం మేళా విజయవంతంగా ముగిసింది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విజేతలను డీఈవో యాదయ్య అభినందించారు. జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. శిక్షణ కోఆర్డినేటర్ చౌదరి, సత్యనారాయణ మూర్తి, సెక్రెటరీ మహేశ్వ ర్‌రెడ్డి, సైన్స్ అధికారి రాజగోపాల్, పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడికి పూర్వ విద్యార్థుల సన్మానం

దండేపల్లి సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయునిగా పదోన్నతి పొందిన అనాటి ఉపాధ్యాయుడు సంగర్స్ రాజేశ్వర్ రావును పూర్వ విద్యార్థులు శాలువతో ఘనంగా సన్మానించారు. దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలో 2006-07 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులకు అనాటి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయుడు సంగర్స్ రాజేశ్వర్‌రావుకు గేజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన సందర్భంగా శుక్రవారం పూర్వ విద్యార్థులు శాలువతో ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులందరు భాగస్వాములు కావాలని హెచ్ఎం కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## 108 సిబ్బందికి సన్మానం

కోటపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని 108 అత్యవసర వాహన సేవలందిస్తున్న సిబ్బందిని శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, నాయకులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. పైలెట్ ఫరీద్, ఈఎంటీ షహబాజ్‌లను శాలువాలతో సత్కరించి అభినందించారు.

## నవరాత్రుల పోస్టర్లు విడుదల

లక్షెట్టిపేట: పట్టణంలోని గోదావరి రోడ్డులో నెలకొల్పుతున్న శ్రీదుర్గా మాతా నవరాత్రుల పూజా విధానం పోస్టర్లను శుక్రవారం స్థానిక తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎస్సై గోపతి సురేష్ చేతుల మీదుగా కమిటీ సభ్యులు విడుదల చేసారు. పట్టణ పురోహితులు వేద పండితుడు ప్రణవ్‌శర్మ మాట్లాడుతూ దుర్గామాతా అమ్మవారు రోజుకు ఒక అవతారంలో భక్తులకు దర్శనం ఇస్తుందన్నారు.

## కాసిపేట వాసికి స్మార్థరత్న అవార్డు

కాసిపేట : మండల కేంద్రానికి చెందిన భూంపెల్లి సాయిరామచార్యులు పౌరహిత్యంలో అందించిన విశిష్ట సేవలకు గాను ఇంటర్నేషనల్ హిందూ టెంపుల్స్ అండ్ స్పిరుచ్చువల్ అస్ట్రాలజీ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో స్మార్థరత్న అవార్డును అందజేశారు. శుక్రవారం వరంగల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. గ్రామీణప్రాంతాల్లో పౌరోహిత్యంలో సేవలందించిన వారికి ఈ అవార్డు అందజేస్తామని వారు తెలిపారు.

## గుండెపోటుతో కార్మికుడి మృతి

కాసిపేట : దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు రేగుంట శంకర్ (53) గుండెపోటుతో మృతిచెందినట్లు దేవాపూర్ ఎస్ఐ గంగారాం తెలిపారు. శుక్రవారం ఉదయం విధులకు వెళ్లిన శంకర్ ఛాతిలో నొప్పి వస్తుందని ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు కంపెనీ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ఆదాని యాజమాన్యం ఆదుకోవాలని కుటుంబీకులు, కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి.

## సంక్షిప్త సమాచారం

## క్రీడలతో ఆరోగ్యం

మందమర్రిటౌన్: క్రీడలతోనే ఆరోగ్యం, క్రమశిక్షణ అలవడుతుందని, విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో ఎస్ జీఎఫ్ అండర్ 19 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కబడ్డీ ఎంపిక పోటీలకు ఆయన హాజరై మాట్లాడారు. క్రీడాకారులు గెలుపోటములను ఒకే విధంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రిన్సిపల్ సారా తస్నీం, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బాబురావు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం ప్రారంభం

కాసిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులు చదువుతున్నారని, సమీప గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు మధ్యాహ్న భోజనం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ చొరవతో మధ్యాహ్న భోజనాన్ని కళాశాలలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు.

అనంతరం ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రదీప్, నాయకులు రమేష్, స్వామి, రాజామౌళి, ఆనంద్, మనోహర్ పాల్గొన్నారు.

## అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టు అమలు చేయాలి

మంచిర్యాల క్రైం, : రాష్ట్ర వ్యాప్తంతో పాటు దేశ వ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని, దాడులను అరికట్టేందుకు తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు మంచిర్యాల జిల్లా బార్ అసోసియేషన్ విధులు బహిష్కరించి శుక్రవారం నిరాహార దీక్షలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టును అమలు చేయాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ సభ్యులు జగన్, రంగు వేణు కుమార్, రంజిత్ కుమా ర్ గౌడ్, న్యాయవాదులు రమణరెడ్డి, సంతోష్ గౌడ్, రవిందర్‌రావు, కొత్త సత్తయ్య పాల్గొన్నారు.

## హనుమాన్ చాలీసా పారాయణం

మంచిర్యాల క్రైం : ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నివాసంలో డీసీసీ అధ్యక్షురాలు సురేఖ కుటుంబ సమేతంగా శుక్రవారం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం పఠించారు. వారి కుటుంబ సభ్యులతో పాటు మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరం

మంచిర్యాల క్రైం : మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కి రాల ప్రేంసాగర్‌రావు జన్మదినం పురస్కరించుకొని ట్రస్మా ఆధ్వర్యంలో ప్రైవేటు విద్యా సంస్థలు మెగా రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దండేపల్లి: వర్షకాలంలో సీజనల్ వ్యాధులపై పాడి రైతు లందరూ అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ధన్‌రాజ్ సూచించారు. శుక్రవారం మండలంలోని కోర్విచెల్మలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించి 280 పశువులకు టీకాలు, వైద్య చికిత్సలు అందజేశారు. దృష్టా పశువులకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్న ముందస్తు గ్రామాలోని పశు వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు.

## హైకోర్టు ఆదేశాలతో ఇరు గ్రామాల మధ్య సర్వే

దండేపల్లి సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్కి వెంకటాపూర్ గ్రామ పంచాయతీని విభజించి తప్పుడు నివేదికలతో వందూర్‌గూడను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారని వందూర్‌గూడ చెందిన గ్రామ పటేల్ దౌలత్‌రావు, గిరిజనులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశారు. దీంతో హైకోర్టు వందూర్‌గూడ జీపీ ఏర్పాటును పున: పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. దీంతో ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీరాజ్ ఎఈ ఈ మహ్మద్ ముఫికోద్దీన్ ఆబీబ్ నెల్కివెంకటాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి వందూర్‌గూడ గ్రామం వరకు సర్వే చేపట్టారు. వందూర్ గూడలో కేవలం 317 మంది గిరిజనులు జనాభా మాత్రమే ఉన్నప్పటికి అధికారులు తప్పుడు లెక్కలతో నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. దీంతో వందూర్‌గూడ గిరిజనులు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇరు గ్రామాల మధ్య చేపట్టిన సర్వే నివేదికను రాష్ట్ర హైకో ర్టుకు సీల్డ్ కవర్ ద్వారా పంపిస్తామన్నారు.

## జాతీయ పురస్కారానికి ఉపాధ్యాయుడి ఎంపిక



దేవరావు(ఫైల్)

లక్షెట్టిపేట, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన డాక్టర్ తుమ్మల దేవరావు అనే ఉపాధ్యాయుడు జాతీయ పురస్కారానికి ఎంపికయ్యాడు. ప్రముఖ కవి అయిన డాక్టర్ తుమ్మల దేవరావు సాహితీ కిరీటి పురస్కారానికి ఎంపికైనట్లు సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం శుక్రవారం నియామక పత్రాన్ని పంపించారు. అవార్డుకు ఎంపికైన ఆయనను సాహితీ మిత్రులు డాక్టర్ దామెరరాములు, డాక్టర్ చక్రదారి, పత్తి శివప్రసాద్, నేరేళ్ల హనుమంతు, జగదీశ్వర్, రాజేశ్వర్‌రెడ్డితో పాటు తోటి ఉపాధ్యాయులు, కవులు అభినందించారు. ఈ నెల 28వ తేదీన హైదరాబాద్‌లో పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

## ముందస్తు బతుకమ్మ సంబురాలు



బెల్లంపల్లిలో బతుకమ్మలతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

బెల్లంపల్లి, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం కళాశాల మైదానంలో విద్యార్థినులు ముందస్తు బతుకమ్మ సంబురాలను నిర్వహించుకున్నారు. తీరొక్కపూలతో బతుకమ్మలను అందంగా పేర్చి బతుకమ్మ ఆటలను ప్రారంభించారు. అనంతరం బతుకమ్మలను స్థానిక పోచమ్మ చెరువులో నిమజ్జనం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపెల్లి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అండర్ 14 బాలుర ఎంపిక పోటీలు

జైపూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్ 14 బాలుర ఎంపిక పోటీలను శనివారం జైపూర్‌లోని టీజీఎస్‌డ బ్ల్యూఆర్ఎస్ కోటపల్లి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలను శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 200 మంది పాల్గొన్నారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్, తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్ఐ శ్రీధర్, ప్రిన్సిపల్ శ్రీధర్, హెచ్ఎం శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ యాకూబ్, అబ్జర్వర్ ఫణి రాజా, పీడీ సాయి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# సరైన పోషణతో ఆరోగ్యవంతమైన రాష్ట్రాన్ని నిర్మిద్దాం

**కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సరైన పోషణతో ఆరోగ్యవంతమైన రాష్ట్రాన్ని నిర్మిద్దామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ భవన సమావేశం మందిరంలో పోషణ మాసం కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబరు 16 వరకు జిల్లాలో నిర్వహించనున్న పోషణమాసం కార్యక్రమాన్ని సంబందిత శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతిరోజు నిర్వహిస్తున్న కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ పోషకాహారం లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారిని సాధారణ స్థితికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ గర్భిణీలకు అవసరమైన వైద్య పరీక్షలను సకాలంలో అందించాలన్నారు. మూత్రశాలలు లేని అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి రౌఫ్ ఖాన్, డీఆర్‌డీవో కిషన్, డీపీవో వెంకటేశ్వర్ రావు, వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ఉప వైద్యాధికారి సుధాకర్, సీడీపీవోలు విజయ, రజిత, పోషన్ అభియాన్ జిల్లా సమన్వయకర్త సౌజన్య పాల్గొన్నారు.



పోషణమాసం పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

## 10నెలల్లో 152కేసులు...

లక్షెట్టిపేట, సెప్టెంబరు, 19(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట అబ్కారీ శాఖ ఆధ్వర్యంలో గడిచిన పది నెలల్లో సుమారు 152కేసులు నమోదు చేసినట్లు లక్షెట్టిపేట ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సమ్మయ్య శుక్రవారం తెలిపారు. నమోదు చేసిన కేసుల్లో ఇప్పటి వరకు 145 మంది నిందితులను పట్టుకోవడంతో పాటు చట్టపరమైన కేసులు కూడా నమోదు చేసామన్నారు. వీటితో పాటు సుమారు 111మందిని తహసీల్దార్ ఎదుట సత్ప్రవర్తన కోసం బైడోవర్ చేసామని, ఇప్పటికి 4బైడోవర్ ఉల్లంగన కేసులు కూడా నమోదు చేసి రూ. 1.70లక్షలు జరిమానా వేసామన్నారు. ఇటీవల నాటు సారా కేసులో పట్టుబడ్డ నిందితుడికి 3నెలల జైలు శిక్ష విధించడం జరిగిందని నాటు సారా రవాణా చేస్తున్న నిందితుల కోసం గాలింపు చేయగా సుమారు 8ద్విచక్ర వాహనాలు కూడా పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ పేర్కొన్నాడు.

# సామాన్యులకు ప్రయోజనం

- 22 నుంచి అమల్లోకి కొత్త జీఎస్టీ టారిఫ్
- రెండు స్లాబులతో వినియోగదారులకు తగ్గనున్న భారం
- వ్యవసాయ ట్రాక్టర్లు, టైర్లు, పురుగు మందుల ధరలు తగ్గింపు
- కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో కొనుగోళ్లకు ఊతం




బెజ్జూరు/చింతలమానేపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్త జీఎస్టీ టారిఫ్‌లను ఈ నెల 22 నుంచి తగ్గిస్తున్నట్లు ప్రకటించడంతో సామాన్య ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. ఈ నెల 22నుంచి పలు రకాల వస్తువులు, వాహనాలపై జీఎస్టీ భారం భారీగా తగ్గుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోళ్లను అప్పటి వరకు వాయిదా వేసుకుంటున్నారు.ప్రధానంగా వాహనాల కొనుగోళ్లలో హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి నగరాల తర్వాత ఉమ్మడి ఆదిలాబాద్ ఉంది. ఇప్పటికే కొత్త టారిఫ్ మూలంగా కొత్త బుకింగ్‌లు నిలిచిపో యాయి. సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోలుపై కూడా ప్రభావం కనబడనుంది. వీటితో పాటు వ్యవసాయ రంగానికి సంబంధించిన ట్రాక్టర్లు, పురు గు మందులు, నీటిపారుదల శాఖకు సంబంధించిన మోటార్లు, విద్యకు సంబంధించిన పుస్తకాలు,ఇతర వాటిపై కూడా జీఎస్టీ తగ్గింపు ప్రభావం ఉండనుంది. నిత్యావసర వస్తువులపై కూడా జీఎస్టీ తగ్గుతుండ డంతో మధ్యతరగతి ప్రజలు సంతోషపడుతున్నారు. ఈ క్రమంలో 22వ తేదీ వరకు కొనుగోళ్ల నెమ్మదించే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

### వివిధ రకాల వస్తువులు..

కేంద్ర ప్రభుత్వం వివిధ రకాల వస్తువులు, వాహనాలు, నిత్యావసర సరుకులపై జీఎస్టీని భారీగా తగ్గించింది. ఈ మేరకు సెప్టెంబరు 3వ తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. దసరాకు 10రోజుల ముందు ఈ నెల 22వ తేదీ నుంచే తగ్గించిన కొత్త జీఎస్టీ అమల్లోకి వస్తుందని కేంద్రం ప్రకటించింది. దీంతో వెనుకబడిన జిల్లాగా ఉన్న జిల్లా ప్రజలకు ఊరట కలగనుంది. ప్రధానంగా జీఎస్టీల తగ్గింపు ప్రభావం వాహన మార్కెట్‌పై తీ వ్రంగా కనిపించ నుంది. ప్రభుత్వం సెప్టెం బరు 3న కొత్త జీఎస్టీ శ్లాబులను ప్రకటించ డంతో వాహనాలు కొను గోలు చేయాలనుకునేవారు ఆలోచనలో పడ్డారు. కొత్త జీఎస్టీలో 28శాతం నుంచి 18శాతానికి వాహనాలపై జీఎస్టీని తగ్గించారు. 10శాతం జీఎస్టీ తగ్గుతుండడంతో వాహనాలు కొనుగోలు చేసేవారు కొత్త టారిఫ్ కోసం వేచి చూస్తున్నారు. ప్రధానంగా మధ్య తరగగతి ప్రజలు అధికంగా వినియోగించే 350సీసీలోపు బైకులపై జీఎస్టీని ప్రభుత్వం 28శాతం నుంచి 18శాతానికి తగ్గించింది. పది శాతం జీఎస్టీ తగ్గుదలతో భారీగా ధరల్లో మార్పు కనిపిస్తుంది. అలాగే 100సీసీ, ఆపై సామర్థ్యం ఉన్న బైకుల ధర రూ.1లక్షకు పైగా ఉన్నాయి. ఇక ఇటీవల ఎక్కువగా క్రేజీ ఉన్న ఎలక్ట్రికల్ బైక్‌ల ధర రూ.30వేల నుంచి రూ. లక్షకు పైగా ఉన్నాయి. వీటిపై కూడా 10శాతం జీఎస్టీ తగ్గుదల ఉంది. ప్రతీ నెల సుమారుగా ఐదు వేలకు పైగా బైకుల విక్రయాలు జరుగుతు న్నాయి. ఈ లెక్కన బైక్ లపై కనిష్టంగా రూ.6వేల నుంచి గరిష్టం గా రూ.25వేల వరకు ధరలు తగ్గనున్నాయి.

### వినియోగదారులకు లబ్ధి..

కేంద్రం భారీగా జీఎస్టీని తగ్గించడంతో సామాన్య ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. పన్ను తగ్గింపు మూలంగా వినియోగదారులకు లబ్ధిచేకూరే అవకాశం ఉంది. కేంద్రం ప్రకటనతో ప్రస్తుతం షోరూముల్లో బుకింగ్‌లు భారీగా తగ్గిపోయాయని నిర్వాహకులు చెబుతున్నారు. ఎక్కువగా పండగ సీజన్లయిన దసరా, దీపావళికి ఎక్కువగా వాహనాలు కొనుగోలు చేయ డానికి ఇష్టపడతారు. ఈ క్రమంలో కేంద్రం కూడా పండగల సీజన్‌లోనే భారీగా వాహనాలపై పన్ను తగ్గింపుతో హుషారుగా వాహనాలు కొనుగోలు చేసేం దుకు సిద్ధమవుతున్నారు. కాగా కొనుగోలుదారులను ఆకర్షించేందుకు షోరూము నిర్వాహకులు కొత్త ఆఫర్లను ప్రకటిస్తున్నారు. ముందుగా బుకింగ్ చేసుకొని 22వ తేదీ తర్వాత డెలివరీ చేసుకోవచ్చని ప్రకటిస్తున్నారు. కొన్ని కంపెనీలు 22వ తేదీ నాటికి వర్తించే జీఎస్టీని తీసుకుంటామని హామీ ఇస్తున్నారు. దీంతో ముందస్తుగా బుకింగ్ కొనుగోలుదారులు అయోమయంలో పడిపోతున్నారు. మరోవైపు సెకండ్ హ్యాండ్ వాహనాలపై కూడా జీఎస్టీ తగ్గింపు ప్రభావం చూపనుంది. బైకులు, కార్లపై 10శాతం తగ్గింపు వస్తుండడంతో పాటు దసరా, దీపావళి ఆఫర్లను ఆయా కంపెనీలు ప్రకటిస్తుండడంతో చాలామంది కొత్త వాహనాల వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో సెకండ్ హ్యాండ్ మార్కెట్ తీవ్ర నష్టాల వైపు చూస్తుందని నిర్వాహకులు వాపోతున్నారు. ఇక ఆరోగ్యానికి సంబంధించిన డయాగ్నస్టిక్ కిట్లు, గ్లూకోమీటర్లు, కళ్లద్దాలు కూడా జీరో జీఎస్టీ పరిధిలోకి రావడం మధ్యతరగతి ప్రజలకు ఊరటగా చెప్పవచ్చు. అలాగే విద్యకు సంబంధించిన మ్యాప్ లు, పుస్తకాలు, క్రేయాన్‌లు, ఎరేజర్‌లు, తదితర విద్య, విద్యార్థులకు సంబంధించిన వాటిపై గతంలో ఉన్న 5శాతం, 12శాతం జీఎస్టీని తొలగించి జీరో పరిధిలోకి తీసుకు రావడం పేద విద్యార్థులకు ఊరట కలిగించనుంది. ఎలక్ట్రికల్ ఉత్పత్తులతో పాటు నిత్యావసర వస్తువుల పై జీఎస్టీ తగ్గింపు కొనుగోలుదారులకు పెద్ద ఊరట కలిగించే అవకాశంగా చెప్పవచ్చు.

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే




మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన టీఎల్ఎం మేళాలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాలో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులలో సృజనాత్మకత శక్తిని పెంపొందించవచ్చని తెలిపారు. విద్యార్థులలో పోటీతత్వాన్ని పెంచవచ్చని అన్నారు. వారిలో అభ్యసన శక్తిని పెంచవచ్చని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు. ఎల్ఎం మేళాలో పాల్గొని విజేతలైన వారిని కలెక్టర్ అభినందించారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే మేళాలో పాల్గొని విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల లోని నైపుణ్యాన్ని బయటికి తీసుకురావాలని ఉపాధ్యాయులు ఆ దిశగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీష్ బాబు, జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఉదయ్‌బాబు, ఎంఈవో లు సుభాష్, అడె ప్రకాష్, ఎస్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వేతనాల సమస్య పరిష్కారానికి కృషి


కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల వేతనాల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను శుక్రవారం ఎమ్మెల్యే కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## మీడియా స్వేచ్ఛను అడ్డుకోవడం సరికాదు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మీడియా స్వేచ్ఛను అడ్డుకోవడం సరికాదని టీయూడబ్ల్యూజే(ఐజేయూ' జిల్లా అధ్యక్షుడు రహెమాన్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ ఆసుపత్రిలో మీడియాపై విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జర్నలిస్టులు ప్రకాష్‌గౌడ్, తారు, హస్నన్, రాధాకృష్ణాచారి, మిలిన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి):** జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ ఆసుపత్రిలో మీడియాపై విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని సోమవారం నిర్వహించే ధర్నాను విజయవతం చేయాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ' జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్‌గౌడ్ అన్నారు. స్థానికంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసు పత్రిలో మీడియాపై విధించిన ఆంక్షలు ఎత్తి వేయాలని కోరారు.

## శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు


రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్న యువ సైన్యం సభ్యులు

తిర్యాణి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని త్రీఇంక్లైన్ నుంచి తిర్యాణి వరకు రోడ్డుకు ఏర్పడిన గుంతలను శుక్రవారం అనిల్ అన్న యువ సైన్యం ఆధ్వర్యంలో శ్రమదానంతో పూడ్చారు. కార్యక్రమంలో అన్న యువసైన్యం ఫౌండర్ అనిల్ గౌడ్, నాయకులు సాగర్, వెంకేటశంగౌడ్, గణపతి, శంకర్, విజయ్, వినోద్, శంకర్, అమర్, హరీష్‌కుమార్, రాజు, సాయికిరణ్, వెంకన్న, చిన్నయ్య, వెంకేటష్, రారాజు, రాజేందర్, శంకర్, వినోద్, అర్జున్, శంకర్, లింగమూర్తి, పవన్, వెంకటేష్, తరుణ్, నవీన్, కైలాష్, అగ్బర్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## 24న మున్నూరు కాపు సంఘం తాలూకా కమిటీ ఎన్నిక

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం తాలూకా కమిటీని ఈ నెల 24న ఎన్నికుంటామని ఆ సంఘం నాయకుడు గణపతి అన్నారు. సంఘ నాయకులతో కలసి శుక్రవారం సన్నాహక స మావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, జక్కయ్య, తిరుపతి, సురేష్, రాజేంద్ర ప్రసాద్, పెంటయ్య ప్రహ్లాద్, మధుకర్, నారాయణ, శంకర్, సదాశివ్, వినోద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రభుత్వ వైద్యశాలలో వైద్య శిబిరం

వాంకిడి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాంకిడి ప్రభుత్వ వైద్యశాలలో శనివారం స్వాస్థనారి శసక్త పరివార్ అభియాన్ పేరిట ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి రియాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక వైద్య నిపుణులతో శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

## వైద్యులకు సన్మానం

సిర్పూర్(టి), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే హరీష్ బాబు కృషి వల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో బాధ్యతలు స్వీకరించిన వైద్యులు రోష, కృపాస్వరూప్, రుబీన్‌ను శుక్రవారం బీజేపీ మండలాధ్యక్షురాలు లావణ్య ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ జోగేందర్, నాయకులు మహేష్, శంకర్, గురుదాస్, నానయ్య, దివాకర్, అశోక్, ప్రశాంత్, సాయి, మారుతి, రాజశేఖర్, శ్యాంరావు, రవి, శేఖర్, శివ, విలాస్, గణేష్, బాలాజీ, శ్రీను, మారుతి తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

దహెగాం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం చిన్నరాస్పెల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సునీత, పీడీ రవి తెలిపారు. అండర్-14 విభాగంలో 9వ తరగతి విద్యార్థినులు రాజేశ్వరి, అంజలి, 8వ తరగతి విద్యార్థినులు శ్రీవాణి, సింధుప్రియ, అండర్-17 విభాగంలో రాజేశ్వరి, అంజలి, హిమబందు ఎంపికైనట్లు తెలిపారు.

# వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా



మాట్లాడుతున్న టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ మధుసూదన్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ టి మధుసూదన్ అన్నారు. చీఫ్ ఇంజనీర్ ఆపరేషన్ అశోక్‌తో కలిసి జిల్లాలోని విద్యుత్ శాఖాధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదా రులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, అవసరమైన అన్ని రకాల పరికరాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలోని అన్ని సబ్ స్టేషన్లకు ప్రత్యామ్నాయ లైన్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్ తగ్గించడానికి మెయింటైనెన్స్ చేపట్టాలని, అన్ని లైన్లు, ట్రాన్స్ఫార్మర్‌లు పరీక్షించి ప్రమాద కారక ప్రాంతాలు గుర్తించి వాటిని సరి చేసేలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉద్యోగులు పని చేసేటప్పుడు అన్ని రకాల భద్రత పరికరాలు ఉపయోగిస్తూ ప్రమా దాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ శేషారావు, డీఈఈ, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

బెజ్జూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఎంఈవో సునీత తల్లిదండ్రులకు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పిషత్ సెకండరీ పాఠశాలలో శుక్రవారం పేరెంట్స్ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. హాజరు శాతాన్ని పెంచేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నారని తెలిపారు.

# న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెబరు 19 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలని ఆసిఫాబాద్ బార్ సోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవి డిమాండ్ చేశారు. సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలని చేపడుతున్న నిరాహార దీక్షకు పోలీసులు అతడిని అరెస్టు చేయడంతో పాటు హైదరాబాద్ మెట్రో పాలిటన్ సిటీ క్రిమినల్ కోర్టులోని న్యాయవాదుల బోగ అనిల్, హనుమాన్ నాయక్‌లపై కక్షిదారులు దాడి చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఆసిఫాబాద్ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని చెప్పారు. న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతుందని అన్నారు. వెంటనే న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ పిలుపు మేరకు విధులు బహిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు చరణ్, సతీష్‌బాబు, ఎ .సురేష్, డి సురేష్, రవీందర్, కిశోర్, గణపతి, రామకృష్ణ, రౌనక్ అగర్వాల్, చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి రవి

## నేటి నుంచి గ్రామసభలు

వాంకిడి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ గ్రామ సభలు శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఈజీఎస్ ఏపీవో శ్రావణ్ తెలిపారు. 20న నవేధరి, 21న నీమ్‌గాం, సరండి, లెండిగూడ, గోయగాం, సవాతి, కోటిగూడ, పిప్పర్‌గొంది, చిచ్చుపల్లి, వెలిగి గ్రామాల్లో ఉంటాయని చెప్పారు. 22న బెండార, జంబుల్ధరి, తేజాపూర్, పాటగూడ, 23న లక్ష్మీపూర్, 24న నవేగూడ, సోనాపూర్, దాబా, 25న బంబార, జైత్‌పూర్, కనర్‌గాం, కిరిడి, సామేల పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నామని తెలిపారు.

## ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు ఇప్పించాం


మాట్లాడుతున్న ఏఐటీయూసీ కార్యదర్శి తిరుపతి

రెబ్బెన, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖైరిగూడ ఓపెన్ కాస్టులో ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు పెంచిన ఘనత ఏఐటీయూసీదేనని ఆ సంఘం బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి అన్నారు. ఖైరిగూడ ఓపెన్‌కాస్టును శుక్రవారం సందర్శించారు. అనంతరం కార్మికులతో మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా తాము ఇచ్చిన హామీలను అమలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు మొగిలి, పిట్ కార్యదర్శి ఎం శ్రీనివాస్, రాజేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాండ్ వాయిద్య కళాకారుల మండల కార్యవర్గం

ఆసిఫాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్యాండ్ వాయిద్య కళాకారుల ఆసిఫాబాద్ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం జిల్లా అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మురళీ, కార్యదర్శిగా రాజయ్య, కోశాధికారిగా సాగర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీను, కార్యవర్గ సభ్యులుగా దివాకర్, రాజేశ్వర్, శేఖర్, సంజీవ్, రవికుమార్, విక్రమ్, అశోక్, రామును ఎన్నుకున్నారు.

# బాలల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీసీపీవో మహేష్

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ, భద్రతకు చర్యలు తీసుకోవాలని డీసీపీవో మహేష్ అన్నారు. మండలంలోని తుంపల్లి గ్రామంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి దేవిక అధ్యక్షతన బాలల సంరక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని 14 సంవత్సరాల లోపు బాలబాలికలందరు విధిగా పాఠశాలలో చేర్పించాలని చెప్పారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే బాల కార్మిక నిషేధ చట్టం ప్రకారం యజమానులపై కేసులు నమోదవుతాయని అన్నారు. బాల్య వివాహాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే, పిల్లలను పనిలో పెట్టుకున్నట్లు గుర్తిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబరు 1098 లేదా 112కు ఫోన్ చేయాలని సూచించారు. 24 గంటలు తమ సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరహరి, చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్ చంద్రశేఖర్, ప్రవీణ్‌కుమార్, గ్రామ పెద్దలు కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు బతుకమ్మ సంబరాలు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులు ముందస్తుగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్ రమాదేవి, జీసీడీవో శకుంతల హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయురాళ్లతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏటీడీవో చిరంజీవి, శ్రీనివాస్, హెచ్‌డబ్ల్యూవో సాయిబాబా, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరమల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్ టౌన్, (ఆంధ్రజ్యోతి):** కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దత్తాత్రేయ, విద్యార్థిణులు, తదితరులు పాల్గొన్నారు.

**సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ సంద ర్భంగా విద్యార్థినులతో కలిసి ఉపాధ్యాయురాళ్లు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**దహెగాం, (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ముందస్తుగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. విద్యార్థినులతో కలిసి ఉపాధ్యాయులు బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ జ్యోతి, ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.


బతుకమ్మ ఆడుతున్న అధికారులు, విద్యార్థినులు, ఉపాధ్యాయురాళ్లు